క్లుప్తంగా

అగ్ని మాపక శాఖ వారోత్సవాలు



నర్సాపూర్ బస్టాండ్‌లో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న ఫైర్ స్టేషన్ సిబ్బంది

నర్సాపూర్: అగ్నిమాపక శాఖ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక బస్టాండ్‌లో సిబ్బంది నీటి పైపులతో మాక్ డ్రిల్ నిర్వహించారు. మంటలను ఆర్పేందుకు వినియోగించే వాటర్ పైపులతో అగ్నిమాపక సిబ్బంది అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అనంతరం బస్టాండ్‌లో ప్రజలకు అగ్నిప్రమాదాలపై ప్రజలను చైతన్యవంతులను చేసే కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది ఐలయ్య, యాదగిరి, వెంకటేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందులు ఉండొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ వెంకటేశం

పెద్దశంకరంపేట(మెదక్): విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎంఈఓ వెంకటేశం అన్నారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో మంగళవారం ప్రధానోపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థుల ఏకరూప దుస్తుల వివరాలను సెర్ప్ సిబ్బందికి అందించాలని, వారి ఆన్‌లైన్ వివరాలను ఎమ్మార్సీ సిబ్బందికి ఇవ్వాలని సూచించారు. విద్యార్థుల మధ్యాహ్న భోజనంకు ఇబ్బందులు లేకుండా చూడాలని, పరీక్షలు పూర్తయిన తర్వాత రిజల్ట్స్‌ను అందజేయాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం విఠల్, హెచ్‌ఎం.రాజేశ్వర్ ఉన్నారు.

పరిశుభ్రంగా మంచినీటి ట్యాంకు ఆవరణ



ట్యాంకు ఆవరణను శుభ్రం చేస్తున్న పంచాయతీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

హవేళీఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని శాలిపేట గ్రామంలో అపరిశుభ్రంగా మంచినీటి ట్యాంకు అనే కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఎంపీడీవో రవీశ్వర్‌గౌడ్, గ్రామ ప్రత్యేక అధికారి సందర్శించి ఆవరణను పరిశుభ్రం చేయించారు. అక్కడ నిలిచి ఉన్న నీరును పంచాయతీ సిబ్బంది తొలగించి, బ్లీచింగ్ పౌడర్ చల్లి పరిశుభ్రంగా చేశారు.

డబుల్ బెడ్రూం ఇళ్లు అందించండి



వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రంలోని డబుల్ బెడ్రూం ఇళ్లు అర్హులైన పేదలకు అందించాలని సీఐటీయూ నాయకులు తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాలమణి మాట్లాడుతూ.. చేగుంటలో నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లక్ష్మినర్సయ్య, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ రజతోత్సవానికి వాల్ రైటింగ్

మెదక్ మున్సిపాలిటీ: ఎల్కతుర్తిలో ఈనెల 27న నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా మెదక్ పట్టణంలోని గాంధీనగర్ వీధిలో ఓ గోడపై పేయింటర్ బీఆర్‌ఎస్ రజతోత్సవ మహా సభ వాల్ రైటింగ్ వేస్తూ కనిపించాడు. అది గమనించిన మాజీ ఎమ్మెల్యే పెయింటర్ బార్డర్ గీసిన గోడపై స్వయంగా కేసీఆర్ గారి నాయకత్వం వర్ధిల్లాలి, చలో వరంగల్ అనే నినాదాలు రాశారు. ఆమె వెంట మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, మాజీ జెడ్పీవైస్ చైర్మన్ లావణ్యారెడ్డి, మాజీ కౌన్సిలర్లు తదితరులు ఉన్నారు.

నిద్రావస్థలో నిఘానేత్రాలు

- అలంకారప్రాయంగా మారిన సీసీ కెమెరాలు
- పట్టించుకోని అధికారులు

వెల్దుర్తి(తూప్రాన్): అధికారుల నిర్లక్ష్యం.. ప్రజాప్రతినిధుల అలసత్వంతో సీసీ కెమెరాలు నిరుపయోగంగా మారాయి. మండల కేంద్రం వెల్దుర్తితో పాటు పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనికిరాకుండా పోయాయి. కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల వచ్చే ఉపయోగాలపై పోలీసులు గ్రామాల్లో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి, అవగాహన కల్పించడంతో అప్పటికప్పుడు దాతలు ముందుకొచ్చి వేలా ది రూపాయలను విరాళాలుగా అందజేశారు. దీంతో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో వచ్చిన విరాళాలను బట్టి ఆయా గ్రామాల్లో కెమెరాలు బిగించారు. అవి తొలినాళ్లలో కొన్ని రోజుల పాటు బాగానే పనిచేశాయి. కానీ వీటి నిర్వహణ సరిగా లేక ప్రస్తుతం చాలా వరకు పనిచేయడం లేదు. కొన్ని చోట్ల కెమెరాలు అలంకారప్రాయంగా మిగలగా మరికొన్ని చోట్ల అపహరణకు గురయ్యాయి.

సీసీ కెమెరాలతోనే రక్షణ..

దొంగతనాలు, అల్లర్లు, అసాంఘీక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల వచ్చే ఉపయోగాలను వివరించారు. ట్రాక్టర్స్ యూనియన్, వర్తక సంఘాలు, యువకులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి తమకు తోచిన విధంగా ఆర్థిక విరాళం అందజేశారు. దీంతో పోలీసుల సహకారంతో గ్రామంలోని ప్రధాన కూడళ్లు, జన సంచారం అధికంగా ఉండే ప్రాంతాలు, గ్రామంలోకి వచ్చిపోయే వారిని గుర్తించడం కోసం కెమెరాలు ఏర్పాటు చేశారు.



రామాయిపల్లిలో మానిటరింగ్‌లో సగం వరకు పనిచేయని కెమెరాలు

నిర్వహణ కొరవడి.. నేలను చూస్తూ..



అలంకారప్రాయంగా మారిన సీసీ కెమెరా

గ్రామాల్లో కెమెరాలు ఏర్పాటు చేయడం వరకు బాగానే ఉన్నా.. వాటి నిర్వహణ చూసే వారు కరువయ్యారు. ఒకటి, రెండు గ్రామాల్లో పంచాయతీ పాలకవర్గం నిర్వహణ బాధ్యతను చూసినప్పటికీ చాలా గ్రామాల్లో కెమెరాలు బిగించడం వరకే తమకు బాధ్యత అన్నట్లు నిర్వహణ పూర్తిగా గాలికి వదిలేశారు. దీంతో చాలా చోట్ల కోతులు, ఇతర కారణాలతో కెమెరాలు సక్రమంగా పనిచేయడం లేదు. కొన్ని చోట్ల నేలను చూస్తుండగా, మరికొన్ని చోట్ల పర్యవేక్షించే నాధుడు లేకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్ స్తంభాలపై ఏర్పాటుచేసిన వాటిని దర్జాగా ఎత్తుకెళ్లారు. ఫలితంగా కెమెరాలు ఏర్పాటు చేసినా.. స్తంభాలు ప్రస్తుతం అలంకారప్రాయంగా మారాయి.

వినియోగంలోకి తీసుకురావాలి



పోలీసుల సూచనలతో ట్రాక్టర్స్ అసోసియేషన్, దాతల సహకారంతో గ్రామంలో 8 కెమెరాలు ఏర్పాటుచేశారు. అందులో సగం వరకు ప్రస్తుతం పనిచేయడంలేదు. మిగిలిన వాటి బ్యాకప్ కూడా సరిగా ఉండడం లేదు. కెమెరాలు సరిగా పనిచేస్తే పోలీసులు ఏవైనా కేసులను సులభంగా చేధించడానికి వీలుంటుంది. అధికారులు స్పందించి కెమెరాలు అన్ని పనిచేసేలా చర్యలు తీసుకోవాలి.

– శ్రీశైలం, రామాయిపల్లి, గ్రామస్తుడు

ప్రత్యేక దృష్టి సారించాలి



నిర్వహణ కొరవడి అలంకారప్రాయంగా మారిన గ్రామాల్లోని సీసీ కెమెరాలను వినియోగంలోకి తీసుకురావాలి. వీటితో ప్రధాన కూడళ్లలో జరిగే పలు ఘటనలపై పోలీసులకు పట్టు పెరుగుతుంది. దొంగతనాలు, కొత్త వ్యక్తుల కదలికలను పసిగట్టవచ్చు. కోతులు, ఇతరాత్ర కారణాలతో కెమెరాలు దెబ్బతినకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

– చంది నర్సింలు, శెట్టిపల్లి కలాన్, వెల్దుర్తి

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు



రెవెన్యూ సిబ్బంది పట్టుకున్న ఇసుక ట్రాక్టర్

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి తహసీల్దార్ సింధూజ అన్నారు. మండల పరిధిలోని చండూర్ గ్రామ శివారులోని మంజీరా వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను రెవెన్యూ సిబ్బంది పట్టుకున్నారు. మంగళవారం ఈ విషయమై సింధూజ మాట్లాడుతూ.. అక్రమంగా ఇసుక తరలిస్తున్న వ్యక్తికి రూ. 10 వేలు జరిమానా విధించామన్నారు. అలాగే, మండల పరిధిలోని సామ్లా తండా శివారులో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం అందడంతో తమ సిబ్బంది వెళ్లి మట్టి తరలిస్తున్న ట్రాక్టర్‌ను తీసుకువచ్చారన్నారు. అనంతరం మట్టి తరలిస్తున్న వ్యక్తికి రూ. 5 వేలు జరిమానా విధించామన్నారు.

వరికోతల వేళ జాగ్రత్తలు తప్పనిసరి



నిర్వాహకులు సూచనలిస్తున్న రాజశేఖర్‌గౌడ్

చిలప్‌చెడ్(నర్సాపూర్): రైతులు వరికోతల సమయంలో జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి రాజశేఖర్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలో వరికోతలను పరిశీలించి, హార్వెస్టర్ డ్రైవర్, యజమాని, రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరికోత కోసేటప్పుడు హార్వెస్టర్ ఆర్‌పీఎం 18 నుంచి 20 ఉండేలా చూసుకోవాలని, హార్వెస్టర్ బ్లోయర్‌ను ఆన్‌లో ఉంచి కోతలు కోయాలన్నారు. ఏఈఓలు కృష్ణవేణి, దివ్యశ్రీ, రైతులు పాల్గొన్నారు.

మురికి కూపంలో భగీరథ పైపులైన్

ఆందోళనలో ప్రజలు

రేగోడ్(మెదక్): స్వచ్ఛ గ్రామాలుగా తీర్చి దిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం లక్షల రూపాయలు నిధులు మంజూరు చేస్తున్నా.. ఆచరణకు నోచుకోవడం లేదు. మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల సమీపంలో అపరిశుభ్రతకు నిలయంగా మారింది. మురికి కూపంలో నుంచే మిషన్ భగీరథ పైపులైన్ ఉండటంతో తాగు నీళ్లు కలుషితం అవుతున్నాయా..? అని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు గుండానే అధికారులు రాకపోకలు సాగిస్తున్నా.. ఈ మురికి కూపం కనిపించకపోవడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



మురికి కూపంలో భగీరథ పైపులైన్

బాలికల పాఠశాలలో టాయిలెట్లు



టాయిలెట్లు ప్రారంభిస్తున్న డీఈఓ రాధాకిషన్

డీఈఓ రాధాకిషన్

రామాయంపేట(మెదక్): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ రోటరీ క్లబ్ సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల పాఠశాలలో పునర్నిర్మాణ పనులు చేపట్టారు. పాఠశాలలో రూ.6.50 లక్షల నిధులతో 8 టాయిలెట్లు నిర్మించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు జస్వంత్ సింగ్, జిల్లా విద్యాధికారి రాధాకిషన్ మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం రోటరీ క్లబ్ అధ్యక్షులు జస్విందర్ సింగ్, రోటరీ క్లబ్ డైరెక్టర్ యుగంధర్ పెనుబోలు మాట్లాడుతూ.. రామాయంపేట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పాఠశాల పునర్నిర్మాణ పనులు అంతర్జాతీయ రోటరీ క్లబ్ సంస్థ ద్వారా సేవా లక్ష్యంతో మెరుగైన సమాజం సంస్థ ఆధ్వర్యంలో శాంతి, ఆరోగ్యం, తల్లి పిల్లల ఆరోగ్యం, తాగునీరు, పారిశుధ్యం ఎడ్యులిన్ ఆర్థికాభివృద్ధి వంటి రంగాలపై దృష్టి సారించిందని తెలిపారు. సురక్షితమైన పరిశుభ్రమైన వాతావరణంలో విద్యార్థులు ఆరోగ్యంగా ఉండడానికి మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బాలుర పాఠశాల హెచ్‌ఎం నాగమణి, పాఠశాల హెచ్‌ఎం రమ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చివరిరోజు తల్లిదండ్రుల సమావేశం నిర్వహించండి

చేగుంట(తూప్రాన్): పాఠశాల చివరి రోజున తల్లిదండ్రుల సమావేశం నిర్వహించాలని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ అన్నారు. మండలంలోని రెడ్డిపల్లి ఉన్నత పాఠశాలను మంగళవారం జిల్లా విద్యాధికారి రాధాకిషన్ రెడ్డిపల్లి ఉన్నత పాఠశాలను సందర్శించి, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. పాఠశాల చివరి రోజున విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి ఫలితాలను వారికి అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు గంగాబాయి, ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, సురేష్, గోవింద్, రాజశేఖర్, శంకర్, శ్రీదేవి ఉన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం



నర్సాపూర్: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి తదితరులు

టేక్మాల్(మెదక్): కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులకు అండగా నిలుస్తుందని ఆ పార్టీ మండలాధ్యక్షుడు రమేశ్ తెలిపారు. మండలంలోని ఎల్లుపేటలో వరి కొనుగోలు కేంద్రాన్ని రమేశ్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మాత్రమే ధాన్యం అమ్మి, మద్దతు ధర పొందాలని తెలిపారు. ఏ- గ్రేడ్ ధాన్యానికి రూ.2320, బీ- గ్రేడ్ ధాన్యానికి రూ.2300, సన్న వరి ధాన్యానికి రూ.500 బోనస్ ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జోగిపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, ఏపీఎం శకుంతల, సీసీ జనబాయి, సీసీ శ్రీనివాస్‌రెడ్డి, సీఏ సంజీవరెడ్డి, ఏఈఓ మీనాకుమారి, మండల నాయకులు భక్తుల కిషోర్, పాపయ్య, అశోక్‌రెడ్డి, నరసింహరెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సురేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బి.సాయిలు, లోహిత్‌రెడ్డి, జనార్ధన్, ప్రభాకర్, లక్ష్మయ్య, రైతులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

చిన్నశంకరంపేట(మెదక్): రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఏర్పాట్లు చేయాలని నార్సింగి ఎంపీడీఓ ఆనంద్ కుమార్ కోరారు. మంగళవారం నార్సింగి మండల కేంద్రంలో మంజీర ఉత్పత్తుదారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని కోరారు. ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులు రైతులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో మంజీర ఉత్పత్తుదారుల సంఘం చైర్మన్ నరసింహారెడ్డి, సీఈఓ మహేశ్, డైరెక్టర్లు నర్సింహులు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

నర్సాపూర్: ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి రైతులకు సూచించారు. ఆమె మంగళవారం మండలంలోని చిప్పల్‌తుర్తి, పెద్ద చింతకుంట, కాగజ్‌మద్దూర్ గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్‌తో కలిసి ప్రారంభించారు. రైతులు తాము పండించిన వడ్లను దళారులకు విక్రయించొద్దని కోరారు. కాగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సునీతారెడ్డి నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో బుధవారం విద్యుత్ అంతరాయం ఉండనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ గణేశ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంలో జాతీయ రహదారి 765డీజీ రోడ్డు పనుల్లో భాగంగా గ్రామానికి చెందిన విద్యుత్ అంతరాయం ఏర్పడనున్నట్లు తెలిపారు. గ్రామస్తులు, వ్యాపారస్తులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

దివ్యాంగుల బస్‌పాస్ మేళా

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో దివ్యాంగులకు బస్‌పాస్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఐకేపీ ఏపీఎం గోపాల్, డిపో కండక్టర్ శేఖర్ మంగళవారం తెలిపారు. నారాయణఖేడ్ డిపో మేనేజర్ మల్లేశయ్య ఆదేశాలతో బుధ, గురువారాల్లో దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్‌లను అందజేస్తామని, వారు తమ సదరం, ఆధార్ కార్డు జీరాక్స్, ఫొటోతో ఆర్టీసీ అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని, ఇతర వివరాలకు 9100044610, 9959415862లకు సంప్రదించాలన్నారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం



మాట్లాడుతున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

చేగుంట(తూప్రాన్): రాజ్యాంగాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రం చేగుంటలో జై-బాపు, జై-సంవిధాన్ పాదయాత్ర మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ గ్రామాల్లో పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు నవీన్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు ఉసామొద్దీన్, శ్రీనివాస్, శ్రీకాంత్ ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య పరీక్షలు



నిజాంపేటలో ఉచిత వైద్య శిబిరం ప్రారంభిస్తున్న ఎస్‌ఐ రాజేష్

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో గాంధీ విగ్రహం వద్ద మంగళవారం తుప్రాన్ వీఎస్‌టీ ఇండస్ట్రీస్ సహకారంతో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మెదక్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్‌ఐ బండి రాజేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. అనంతరం రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీనివాసరావు, జిల్లా చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో రక్తదాన శిబిరాలు, మెగా వైద్య క్యాంపులు, ఇతర సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఇందులో ఉచితంగా మందుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి ఆస్పత్రికి చెందిన డాక్టర్లు ఉమేశ్ రఘుప్రసాద్, సాయి సురమి, అభినవ్, చంద్రశేఖర్, అరుణ్ కాంత్ రెడ్డి, ప్రణీత, శ్రీ చరిత్ర, తహసీల్దార్ రమ్యశ్రీ, ఆర్‌ఐ ప్రీతి, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కోశాధికారి డీ.జీ.శ్రీనివాస్ శర్మ, మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు యాదగిరి, సత్యం, దామోదర్‌రావు, లక్ష్మణ్ యాదవ్, వంగరీ కైలాస్, తోట శ్రీనివాస్, మాధవరెడ్డి, తిరుపతి, స్వామి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిగా గుర్తించి పట్టాలివ్వాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు, కార్మిక సంఘం నాయకులు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని కొంగోడ్ గ్రామంలో ఏళ్ల తరబడిగా సాగు చేస్తున్న రెవెన్యూ భూమిని, ప్రభుత్వ భూమిగా గుర్తిస్తూ పట్టా పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశం డిమాండ్ చేశారు. మంగళవారం అక్కడి రైతులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట రెవెన్యూ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ.. గ్రామంలో 209 సర్వేనంబర్ భూమిని కొందరు గ్రామస్తులు 70 ఏళ్లుగా సాగు చేస్తూ కాస్తులో ఉంటూ వస్తున్నారన్నారు. ఇదే సమయంలో ఫారెస్ట్ అధికారులు తమ భూమిగా వాదిస్తూ రైతులను భూమిలోకి రాకుండా అడ్డుకున్నారన్నారు. రైతుల డిమాండ్‌తో 2012లో రెవెన్యూ, ఫారెస్ట్ అధికారుల జాయింట్ సర్వేలో రెవెన్యూ భూమిగా గుర్తించామన్నారు. అయినా కాస్తులో ఉన్న రైతులకు పట్టాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ వచ్చారని ఆరోపించారు. నర్సాపూర్ ఆర్డీఓ 2018 రెవెన్యూ భూమిగా సర్టిఫికెట్ జారీ చేశారన్నారు. అయినప్పటికీ స్థానిక తహసీల్దార్ అది ఫారెస్ట్ భూమి అంటూ రైతులను గందరగోళానికి గురి చేస్తూ వస్తుండడం కుట్రపూరితమన్నారు. కావాలనే అధికారులు రైతులను ఇబ్బంది గురిచేస్తూ వస్తున్నారని, ఇప్పటికైనా ఈ విషయంలో జిల్లా అధికారులు స్పందించి, రైతులకు వెంటనే పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు దుర్గయ్య, లక్ష్మి, సత్తెమ్మ, యాదగిరి, యేసయ్య, మల్లేశం, షేకులు, వినోద తదితరులు పాల్గొన్నారు.

సన్నబియ్యం పంపిణీ



లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేస్తున్న రాజిరెడ్డి, సాయికుమార్, సుహాసినిరెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): పేద ప్రజల కడుపు నింపేందుకే ప్రభుత్వం రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ చేస్తుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, బాపూ, జై భీమ్, జై సంవిధాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర మత్స్యశాఖ కార్పొరేషన్ చైర్మన్ సాయికుమార్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సన్నబియ్యం లబ్ధిదారుడు మల్లేశం ఇంట్లో నాయకులు సహపంక్తి భోజనం చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పాపన్నపేట(మెదక్): ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని గాంధారిపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన జేజీ జైలు(64) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత నెల 31న ఇంటి సమీపంలో ఉన్న కిరాణా షాపునకు వెళ్లి వస్తుండగా కళ్లు తిరిగి కిందపడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో కుటుంబీకులు చికిత్స నిమిత్తం మెదక్‌కు తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు రత్నయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిపై ఫిర్యాదు



నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు రాజేష్, రాజేందర్‌రెడ్డి



చేగుంట(తూప్రాన్): పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిపై నార్సింగి పోలీసులకు కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ నాయకులు, న్యాయవాది అంచనూరి రాజేశ్ ఫిర్యాదు చేశారు. మంగళవారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దుబ్బాక నియోజకవర్గంలోని తొగుటలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని పడగొట్టాలని వ్యాపారులు, బిల్డర్స్ తనను కోరుతున్నారని అనుచిత వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వాన్ని కూల్చేందుకు కొత్త ప్రభాకర్‌రెడ్డి కుట్ర చేస్తున్నారని, రాజ్యద్రోహం కేసుపెట్టి చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట నార్సింగి మండల కాంగ్రెస్ నాయకులు రాజేందర్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, సుధాకర్, భాకర్, బాచి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

చేగుంట(తూప్రాన్): దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిపై మండల కాంగ్రెస్ నాయకులు చేగుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలాధ్యక్షుడు నవీన్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టాలని పిలుపు ఇవ్వడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని తెలిపారు.

ఇసుక రీచ్‌ల కోసం స్థల పరిశీలన

వెల్దుర్తి(తూప్రాన్): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు తక్కువ ధరకే ఇసుకను అందించి ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అందులో భాగంగానే వెల్దుర్తి మండల పరిధిలోని హల్దీవాగులోని ఇసుకను లబ్ధిదారులకు అందించేందుకు మండలంలో ఆరు చోట్ల హల్దీవాగుపై ఇసుకరీచ్‌ల ఏర్పాటుకు ఇటీవల జిల్లా మైనింగ్ శాఖ అధికారులు గ్రౌండ్ వాటర్, ఇరిగేషన్, తహసీల్దార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌లకు ప్రతిపాదనలు పంపారు. దీంతో మంగళవారం ఆయా శాఖల అధికారులు సంయుక్తంగా మెల్లూర్, వెల్దుర్తి గ్రామ శివారులోని హల్దీవాగు పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. ఇసుక లభ్యతపై పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గిర్దావర్ నర్సింగ్‌యాదవ్, ఇరిగేషన్ డీఈ రాజేందర్, మైనింగ్, గ్రౌండ్ వాటర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.